## ఇందిరమ్మ ఇండ్ల తుది బిల్లులపై కొనసాగుతున్న అయోమయం

అధికారుల మౌనం.. 'డబ్బులు ఎప్పుడు?' అని ఎదురుచూస్తున్న లబ్ధిదారులు





# సిద్దిపేట సంగారెడ్డి మెదక్

సోమవారం 29 జూన్ 2026 పేజీలు : 8



# జీవించడం ప్రతి మనిషి హక్కు

### ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి బి ఆర్ అంబేద్కర్

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహా

మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 28:

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ డాక్టర్ మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లుట్ల గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గారి విగ్రహాన్ని ఆవిష్కరించటం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహం సమానత్వానికి ప్రతీక. సామాజిక న్యాయానికి చిహ్నం. ప్రతి పేద కుటుంబానికి ఆశాజ్యోతి. ప్రతి యువకుడికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అంబేద్కర్ గారి జీవితం -- మనందరికీ ఆదర్శమన్నారు. చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు. చదువుతో ప్రపంచాన్ని గెలిచారన్నారు. వారు మనకు చెప్పిన గొప్ప సందేశం ఒక్కటే పుట్టుక మన చేతిలో ఉండదు... కానీ జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకో వాలో మన చేతిలోనే ఉంటుందన్నారు. బాబాసాహెబ్ డా. బి ఆర్ అంబేడ్కర్ బహు భాషా వేత్త. ఆర్థికశాస్త్రం, రాజకీయశాస్త్రం, న్యాయ శాస్త్రం, చరిత్ర అన్నింటిలో నిష్ణాతుడు. అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేశారు. అంబేడ్కర్ తన కోసం జీవించలేదు. సమాజం కోసం జీవించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడారు. సమాన హక్కుల - మిగతా2లో

# నాణ్యత లేని సీసీ రోడ్డు మామూళ్ల మత్తులో అధికారులు.





### రెండున్నర ఏళ్ళకే సీసీ రోడ్డు పగుళ్ళు

### ఇసుక లేకుండానే మహిళా సమాఖ్యల భవన నిర్మాణాలు

### పట్టించుకోని అధికారులు

కొండాపూర్ ప్రజా జ్యోతి

గ్రామాలలో అభివృద్ధి పేరుతో చేపడుతున్న సీసీ రోడ్డు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పూర్తిగా గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాల్లో అవసరమైన మోతాదులో ఇసుక వినియోగించకుండా కేవలం సిమెంట్, కంకరతో పనులు చేస్తున్నారని స్థానిక నేతలు ఆరోపిస్తున్నారు. దీంతో నిర్మాణాలు పూర్తయ్యే - మిగతా3లో

# పోలియో రహిత సమాజం నిర్మిద్దాం: అదనపు కలెక్టర్ నగేష్

## పిల్లుట్లలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం





**శివ్వంపేట ప్రజాజ్యోతి జూన్ 28:** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందించడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,,పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలే రక్షణ కవచమని అన్నారు.జిల్లాలోని ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు,సిబ్బంది,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లుట్లలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి దామోదర రాజనర్సింహ

### అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలి: మంత్రి దామోదర





**శివ్వంపేట ప్రజాజ్యోతి జూన్ 28:** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ,నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ,,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అడుగుజాడల్లో యువత నడవాలని,ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని పిలుపునిచ్చారు.విగ్రహ దాత గౌరెడ్డి వెంకట నరసింహారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు...

## శ్రీ లలితా పరమేశ్వరీ దేవి అష్టమ వార్షికోత్సవ మహోత్సవం

**ఆలయ వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్ర శర్మ**





**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూన్ 28:** తూప్రాన్ మండలం వెంకటాపురంలోని శ్రీ లలిత పరమేశ్వరీ దేవీ ఆలయం అష్టమ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్ర శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో ఉదయం అమ్మవారికి పవిత్ర అభిషేకం, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 1345వ చండీయాగం వైదిక మంత్రోచ్చారణల నడుమ భక్తిపూర్వకంగా నిర్వహించారు.అమ్మవారి కృపాకటాక్షంతో జన్మించిన చిన్నారులకు తులాభారం నిర్వహించడం విశేష ఆకర్షణగా నిలిచింది. అనంతరం శ్రీమతి కొరిడె హరిణా పవన్ గేయ రామాయణ హరికథ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది.ఈ కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం పంపిణీతో పాటు మహా అన్నదాన సేవ నిర్వహించారు. ఈ పవిత్ర ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## జీవించడం ప్రతి మనిషి హక్కు



-మొదటిపేజీ తరువాయి

కోసం దేశవ్యాప్తం గా ఉద్యమించారు. గౌరవంగా జీవించడం ప్రతి మనిషి హక్కు" అని ఆయన మనకు నేర్పించారు. మన దేశానికి బీ.ఆర్ అంబేద్కర్ అందించిన అత్యంత గొప్ప కానుక భారత రాజ్యాంగం. రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, గౌరవప్రదమైన జీవితం అందించింద న్నారు. అందుకే ఆయనను భారత ప్రజాస్వామ్య శిల్పిగా పిలుస్తామన్నారు. బాబాసాహెబ్ చెప్పిన మార్గంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, మానవ గౌరవం కోసం మనమంద రం కలిసి ముందుకు సాగుదాం. మన యువత బాబాసా హెబ్ జీవితాన్ని చదవాలని పిలుపు నిచ్చారు. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. విద్యను ఆయుధంగా మార్చుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుర్ర మురళీ గౌడ్, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జి రాజిరెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గౌడ జాతి ఆత్మీయతను ఆలపించిన ప్రత్యేక గీతం

**మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా విడుదల**



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) జూన్ 28:** వెల్దుర్తి మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ 11వ వార్షికోత్సవ మహోత్సవాల సందర్భంగా గౌడ కుల సంప్రదాయాలు, అలాగే గౌడ కులదైవమైన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి మహిమను ప్రతిబింబించేలా పొన్నం ప్రసాద్ గౌడ్ ప్రత్యేకంగా గౌడ కులం పై రూపొందించిన గీతాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని గౌడ సంఘం సభ్యుల సమక్షంలో పాటను విడుదల చేశారు. ఈ గీతంలో గౌడ కులస్తుల ఆత్మీయత, ఐక్యత, సంస్కృతి, సంప్రదాయాలు, అలాగే కులదైవమైన ఎల్లమ్మ తల్లిపై ఉన్న అపారమైన భక్తి భావాన్ని హృద్యంగా ఆవిష్కరించారు. మహోత్సవాల సందర్భంగా విడుదలైన ఈ పాట గౌడ సమాజంలో నూతన ఉత్సాహాన్ని నింపుతూ, ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగిస్తుంది.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, గౌడ కుల పెద్దలు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాట ఆవిష్కరణను విజయవంతం చేశారు.

# జిల్లాలో 97.8 % పల్స్ పోలియో విజయవంతం

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 28:** జిల్లాలో ఈరోజు( పోలియో ఆదివారం) 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , 157 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు , 1 అర్బన్ హెల్త్ సెంటర్ , కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పటల్ పరిధిలో గల 5 సంవత్సరముల లోపు పిల్లలకు 97.8 % పోలియో చుక్కలు వేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ తెలిపారు . వెల్దుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమం లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో కలిసి పోలియో చుక్కలు వేశారు .457 పోలియో బూతులు, 46 రూట్లు, 20 ట్రాన్సిట్ సెంటర్లు, 872 టీమ్స్ , 1828 సిబ్బంది ద్వారా 75496 మంది పిల్లలకు గాను ఈరోజు 73643 మంది పిల్లలకు ( 97.8 %) పోలియో చుక్కలు వేశామని, నాతో పాటు , జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా. జయశ్రీ , డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. లు , ప్రోగ్రాం అధికారులు , మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొని పోలియో కార్యక్రమాన్ని విజయవం తం చేశారు . ఈరోజు పోలియో బూత్ ల వద్ద పోలియో చుక్కలు వేసుకోని 5 సంవత్సరాల లోపు పిల్లలకు వారి ఇంటివద్దకే వెళ్లి రేపు, ఎల్లుండి ( 29,30 తేదీలలో) పోలియో చుక్కలు వేస్తామని , రాష్ట్ర హెల్త్ కమీషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఒక్కరూ కూడా మిగలకుండా



యాక్షన్ ప్లాన్ ద్వారా పర్యవేక్షణ చేశామని , పల్స్ పోలియో ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు డా. అరుణ్, జాయింట్ డైరెక్టర్ జిల్లాలో పర్యవేక్షణ చేస్తున్నారని , రాజకీయ ప్రతినిధులకు , జిల్లా అధికారులకు,జర్నలిస్టులకు , ప్రజలకు , సహకరిం చిన ప్రతి ఒక్కరికీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ కృతజ్ఞతలు తెలిపారు .

# ఉద్యోగ రీత్యా విరమణ తప్పదు

## ఉద్యోగ విరమణ అభినందన సభలో ప్రధానోపాధ్యాయురాలు సుకన్య

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 28:** పదవి విరమణ ప్రతి ఒక్క ఉద్యోగికి తప్పనిసరిగా అని సమాజంలో మంచి గుర్తింపు పొందిన ఉపాధ్యాయురాలుగా పద్మావతి మేడం అని ప్రధానోపాధ్యాయురాలు సుకన్య అభిప్రాయం వ్యక్తం చేశారు.ఆదివారం మెదక్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాచవరంలో తెలుగు ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మావతి ఉద్యోగ విరమణ అభినందన సభ మండల పరిధిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో. ఘనంగా విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఉద్యోగ విరమణ సభను ఉద్దేశించి మాచవరం కాంప్లెక్స్ మరియు మాచావారం ఉన్నత పాఠశాల . గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఎడ్ల సుకన్య మాట్లాడుతూ అని మాచవరం ఉన్నత పాఠశాలలో 14 సంవత్సరాల పాటు తెలుగు సబ్జెక్టును బోధిస్తూ పదవి విరమణ పొందిన పద్మావతికి అభినందనలు తెలిపారు. పద్మావతి విద్యార్థులతో మమేకమై పాఠాలు బోధించేవారని సమయపాలన పాటించడంలో ఆమె ముందు వరుసలో ఉండేదన్నారు , ప్రతి విద్యార్థితో ఆమె మమేకమై బోధించే వారని . విద్యార్థుల ప్రగతిలో ఆమె కృషి అమోఘమని సుకన్య అన్నారు.ఈ ఉద్యోగ విరమణ అభినందన



కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పనింద్ర , సత్యనారాయణ, పాత్రికేయులు శరత్ చంద్ర , శంకర్ దయాల్ చారి మరియు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎల్.మల్లారెడ్డి , శిరిగి ప్రభాకర్ , నీలకంఠం కొండల్ రెడ్డి. అంజగౌడ్,. కిష్టయ్య , మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు మరియు మెదక్ పట్టణ ఆర్యవైశ్య.ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో పేకాట స్థావరంపై దాడి: ఐదుగురు అరెస్ట్, రూ.22,930 స్వాధీనం

**శివ్వంపేట ప్రజాజ్యోతి జూన్ 28:** శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంట్లో చట్టవిరుద్ధంగా పేకాట ఆడుతున్న స్థావరంపై శివ్వంపేట పోలీసులు శనివారం మెరుపు దాడి నిర్వహించారు.నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.22,930 నగదుతో పాటు 5 మొబైల్ ఫోన్లు,పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారు లష్కరి స్వామి (41),వడ్ల ప్రభాకర్ (31),గడ్డం శ్రీకాంత్ రెడ్డి (38), వజ్జా హరి (26),రుస్తుంపేట సాయి (28).వీరంతా శివ్వంపేట మండలానికి చెందిన వారే.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శివ్వంపేట ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో చట్టవ్యతిరేక,అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే



ఎంతటి వారైనా ఉపేక్షించబోమని,కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.గ్రామీణ ప్రాంతాల్లో జూదం,పేకాట వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్.



మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 28: మెదక్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ఇటీవల ప్రారంభించారు. కాగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఆదివారం జర్నలిస్టులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, జర్నలిస్టుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జర్నలిస్టులు శంకర్ దయాల్ చారి, కామాటి కృష్ణ, సంగమేశ్వర్, ఉషయ్య, ఆంజనేయులు, ఫణి, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

## చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు.



**అల్లదుర్గం జూన్ 28 (ప్రజాజ్యోతి)** అల్లాదుర్గం.. చిన్నారుల రక్షణ కు, నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు వేయించాలని వట్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, వైద్యాధికారి సారిక లు అన్నారు. జాతీయ పల్స్ పోలియో లో భాగంగా మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కల వేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఐదేళ్ల లోపు ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని అప్పుడే పోలియో రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అలాగే మండల పరిధిలోని ఆయా గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమం లో భాగంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలు, ఉప సర్పంచ్ సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, ఏఎన్ఎం హాసీనా, ఆశా వర్కర్ లక్ష్మి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# వెల్దుర్తిలో వైభవంగా శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి వార్షిక మహోత్సవాలు





### మూడు రోజులపాటు ఆధ్యాత్మిక వేడుకలు

### పోచమ్మకు బోనాల సమర్పణతో ఆరంభం



**వెల్దుర్తి, జూన్ 28 (ప్రజాజ్యోతి):** వెల్దుర్తి మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయ 11వ వార్షిక మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు కొనసాగే ఈ ఉత్సవాలకు గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. మహోత్సవాల తొలి రోజున గ్రామ దేవతలు శ్రీ పోచమ్మ అమ్మవారికి మరియు శ్రీ ముత్యాలమ్మ వారికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువతులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనగా, ఆలయ పరిసరాలు భక్తుల రాకపోకలతో కళకళలాడాయి.జూన్ 28 నుంచి 30 వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు, మహా హోమం నిర్వహించి, అనంతరం శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరపనున్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణతో పాటు భక్తులను అలరించే సాంప్రదాయ గావురంగం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మహోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని, మూడు రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని గౌడ సంఘం సభ్యులు కోరారు.

## ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**-- డాక్టర్ జేబా కమ్యూనికేషన్ సెంటర్ అధికారి**



**కల్వ ర్ , జూన్ 28: ప్రజా జ్యోతి.** ప్రతి చిన్నారి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలంటే పోలియో నిర్మూలనలో ప్రతి తల్లిదండ్రి తమ బాధ్యతను నిర్వర్తించాలని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జేబా అన్నారు. ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సమీప పోలియో కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా కల్వ ర్ గ్రామ సర్పంచ్ కోడి గంగారాం మాట్లాడుతూ, "ప్రతి చిన్నారి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడమే మన లక్ష్యం. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత" అని అన్నారు. అనంతరం ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఉపసర్పంచ్ పి. మహేష్ సమీప పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పనులను పక్కనపెట్టి పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో వంటి మహమ్మారి నుంచి పిల్లలను రక్షించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక సీనియర్ నాయకులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల తుది బిల్లులపై కొనసాగుతున్న అయోమయం

**అందోలు, జూన్ 28 (ప్రజాజ్యోతి):** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిన లబ్ధిదారులు తుది బిల్లు కోసం నెలలుగా ఎదురుచూస్తున్నారు. అయితే బిల్లుల విడుదలపై అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా, "త్వరలో వస్తాయి" అనే సమాధానం తప్ప ఖచ్చితమైన తేదీ మాత్రం చెప్పలేకపోతున్నారని వారు వాపోతున్నారు. గతంలో ప్రభుత్వం జూన్ రెండో తేదీన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ముందే పెండింగ్ బిల్లులన్నీ విడుదలవుతాయని అధికారులు చెప్పినా అయితే అది ఆచరణలో అమలు కాకపోవడంతో లబ్ధిదారులు నిరాశకు గురయ్యారు. ఇళ్ల నిర్మాణం కోసం అప్పులు చేసి పనులు పూర్తి చేసిన కుటుంబాలు ఇప్పుడు తుది బిల్లు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.ల బిల్లుల చెల్లింపుపై సంబంధిత అధికారులను ప్రశ్నించినా స్పష్టమైన సమాధానం రావడం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు.

**నిధులు ఎప్పుడు విడుదల అవుతాయి?**

అనే ప్రశ్నలకు కూడా అధికారులు నిర్దిష్టమైన తేదీ చెప్పలేకపోతున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికే నిర్మాణ సామగ్రి సరఫరాదారుల బిల్లులు, కూలీలకు చెల్లింపులు చేయాల్సి రావడంతో పలువురు లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులను విడుదల చేసి, లబ్ధిదారుల ఆందోళనకు తెరదించాలని వారు కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం విజయవంతం కావాలంటే నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు తుది బిల్లులను ఆలస్యం చేయకుండా చెల్లించడం అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు బిల్లుల విడుదలపై స్పష్టమైన ప్రకటన చేసి, అయోమయానికి ముగింపు పలకాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మల్కాపూర్ పేరులేని అక్రమార్కుల వెంచర్ పై చర్యలేవి..?

**నోటీసులకే పరిమితమైన అధికారులు**

**యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ వెంచర్లు, లేఅవుట్లు**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని రెవెన్యూ గ్రామాల శివార్లలో అనుమతులకు మించి అక్రమ వెంచర్లు, లేఅవుట్లు, నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత కొంతకాలంగా మేజర్ గ్రామం, మల్కాపూర్ తదితర గ్రామాల శివార్లలో అనుమతులకు విరుద్ధంగా ఇళ్ల నిర్మాణాలు, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపు, అక్రమ ప్లాట్ల విక్రయాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమాచారం ప్రకారం మండల వ్యాప్తంగా సుమారు 2,000 ఎకరాల మేర వెంచర్లు, లేఅవుట్లు, నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. అనేక చోట్ల నిబంధనలను ఉల్లంఘించి కాలువలు, కుంటలు, వాగులను పూడ్చివేయడం, గ్రామపంచాయతీకి ఇవ్వాల్సిన 10 శాతం ఓపెన్ ల్యాండ్‌ను సైతం ఆక్రమించి విక్రయించిన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. కొండలు, గుట్టల ప్రాంతాల్లో చెట్లను నరికి వెంచర్ల నిర్మాణాలు చేపడుతుండడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం**

అక్రమ నిర్మాణాలపై ప్రజావాణిలో పలుమార్లు ఫిర్యాదులు చేయడం, వార్తాపత్రికల్లో కథనాలు వెలువడిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ, తదుపరి చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు యథావిధిగా కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్**

జిల్లా కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ వెంచర్లు, నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారితో పాటు వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం నోటీసులతోనే సరిపెట్టకుండా అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పల్స్ పోలియో చుక్కలను వేసిన శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ సాత ప్రవీణ్ కుమార్..

**శంకర్ పల్లి;** శంకర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం శంకర్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్. ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, స్థానిక ఏఎంసి చైర్మన్ చేకూర్తా గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశెట్టి చంద్రమోహన్ లు చిన్నపిల్లలకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు తమ ఐదు సంవత్సరాలు లోపు ఉన్న పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతి రెడ్డి మాట్లాడుతూ మండలంలో 36 పల్స్ పోలియో బూత్లను ఏర్పాటుచేసి పోలియో చుక్కలను వేయడం జరిగిందన్నారు.

# నాణ్యత లేని సీసీ రోడ్డు మామూళ్ల మత్తులో అధికారులు.

-మొదటిపేజీ తరువాయి

నాటికి పగుళ్ళు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిర్మించిన రెండున్నర ఏళ్ళకే పగుళ్ళు**

మండల పరిదిలోని గత రెండేళ్ళ క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లను ఏర్పాటు చేశారు. అయితే సీసీ రోడ్లలో ఇసుక కు బదులు మొత్తం డస్ట్‌ను ఉపయోగించి నిర్మించారు. దీంతో సీసీ రోడ్డు వేసినా రెండున్నర ఏళ్ళకే పగుళ్ళు ఏర్పడ్డాయి. కేవలం మారేపల్లిలోనే కాకుండా సదరు కాంట్రాక్టర్ వేసినా అన్ని గ్రామాలలోనూ ఇదే పరిస్థితి ఉందని స్థానిక గ్రామాలలో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటేవలే ప్రభుత్వం అన్ని గ్రామాలలో డ్వాక్రా మహిళల సమావేశాల ఏర్పాటుకు భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం ప్రస్తుతం స్లాబ్ వరకు పూర్తి కాగా స్లాబ్‌లోనూ సుక వాడకుండా కేవలం డస్ట్‌ను మాత్రమే వినియోగించారు. ఇదే కాకుండా నిబంధనలకు విరుద్దంగా అతి తక్కువ ఖర్చుతో అయినటువంటి సిమెంట్ ఇటుకలతో గోడలను నిర్మించడం విశేషం. గతంలో వేసిన సీసీ రోడ్డుకు సైతం సైడ్ బర్మ్ వేయకపోవడంతో గ్రామాలలో వాహానదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అధికారుల పర్యవేక్షణ కరువు.**

కాంట్రాక్టర్‌లు తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలు చేపడుతున్న సదరు అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామాలలో నిర్మాణాలు చేపడుతున్నప్పుడు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు తమ మాముళ్ళ మత్తుకు అలవాటు పడి జిల్లా కేంద్రానికే పరిమితమౌతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనుల నాణ్యతను ఎవరూ పర్యవేక్షించకపోవడంతో ప్రజా ధనం వృధా అవుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ప్రతి అదికారికి మాముళ్ళు ఇస్తున్నామని ఎవరు వచ్చినా ఇలాగే నిర్మాణాలు చేపడుతామంటూ సదరు కాంట్రాక్టర్ మాట్లాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవడంతో అవసరమైతే పనులను నిలిపివేసి తిరిగి నాణ్యతతో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**లోపాలను సరి చేస్తాం శ్రీనివాస్ రెడ్డి పీఆర్ ఏఈ**

గతంలో వేసిన సీసీ రోడ్డుకు సంబందించి పగుళ్ళు ఏర్పడిన విషయం ఇటేవలే నా దృష్టికి వచ్చింది. తప్పనిసరిగా పగుళ్ళు వచ్చిన దగ్గర వాటిని సరి చేస్తాం. నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపడితే తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం. మహిళా సమాఖ్య భవనాల

## బీఎల్ఏ ల పనితీరుతోనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో విజయావకాశాలు

**-అమీన్ పూర్ లో బీజేపీ బీఎల్ఏ-2లకు గుర్తింపు కార్డుల పంపిణీ**





**అమీన్పూర్(ప్రజాజ్యోతి) జూన్ 28** రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం బీఎల్ఏ-2ల క్షేత్రస్థాయి పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని అమీన్ పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటేల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన 24 పోలింగ్ బూతులకు ానియమితులైన బీఎల్ఏ-లకు అధికారిక గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీఎల్ఏ లు కీలక బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ప్రతి బూత్‌లో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో అక్రమంగా నమోదైన ఓట్లను గుర్తించి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ అప్పగించిన బాధ్యతలను ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు అంజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, నాయకులు పణ్యాల శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే రమేష్, సముద్రాల రాకేష్, రామ్‌కిషన్, కట్ట గణేష్, తిరుపతిరెడ్డి, వేణుగోపాల్, సృజన్, అనిల్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెర్పోల్ గ్రామంలో ఓపెన్ డ్రైనేజ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.

గ్రామాల అభివృద్ధి లక్ష్యం ఎమ్మెల్యే చింత ప్రభాకర్.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని తెర్పోల్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు గ్రామ సర్పంచ్ సతీష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడంపై గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని, అధికార-- ప్రతిపక్ష భేదం లేకుండా నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న నిరెడి బిక్షపతి నివాసం వెళ్లి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. చెల్లగోపులారంలో పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సతీష్, మండల పార్టీ అధ్యక్షులు మ్యాకం విఠల్, ఉప సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మోహన్ గౌడ్, సదాశివపేట మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, డాకూరి శేఖర్, మన్సూర్, సర్పంచ్ రామ్ చందర్, మోహన్, కృష్ణ, మాజీ సర్పంచ్ ప్రకాష్, మాజీ ఎంపీటీసీ అనంత రాములు గౌడ్, వార్డు మెంబర్ శివయ్య, రాజు, మాజీ ఎంపీటీసీ రామదాసు, శ్రీను, విష్ణు, శివరాములు, శ్రీకాంత్ రెడ్డి, మహేనుబ్, మహుమద్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఎస్సై సోమేశ్వరి.




**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలో సీసీ కెమెరాలు లేని గ్రామాలలో తప్పకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని కొండాపూర్ ఎస్.ఐ సోమేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే దొంగతనాలు,గొడవలు జరగడానికి తావుండదని అన్నారు. కావున ప్రతి గ్రామ సర్పంచ్ బాధ్యతగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లయితే దొంగతనాలు,గొడవలు, జరిగితే వెనువెంటనే సమస్యకు పరిష్కారం సీసీ కెమెరా ఆధారంగా దొరుకుతుందని అన్నారు. కల్లు దుకాణాలలో కచ్చితంగా సిసి కెమెరాలు ఉండాలని తెలిపారు.

# రూ.30 లక్షల ఖర్చుతో గోడౌన్ నిర్మాణ పనులకు శ్రీకారం.
# ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి శంకుస్థాపన.





**కల్హేర్, జూన్ 28:. ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా లోని కల్హే ర్ మండలంలోని మార్డి గ్రామంలోరైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ నిధులతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన ధాన్య నిల్వ గోడౌన్ నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ఈ గోడౌన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు, సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి మౌలిక సదుపాయాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక నాయకులు, రైతులతో ఎమ్మెల్యే ముచ్చటించి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.. సర్పంచ్ ఎన్నం విజయలక్ష్మి తదితరులు ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా పుష్పగుచ్ఛం.శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్డి గ్రామ సర్పంచ్ ఎన్నం విజయలక్ష్మి, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, స్థానిక సీనియర్ నాయకులు ఎన్. నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు వై. జితేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ భూరుగుల పోచయ్య, కల్హేర్ సర్పంచ్ కోడి గంగారం, గైని దేవదాస్, కృష్ణాపూర్ గ్రామ ప్రతినిధులు, యువ నాయకుడు మల్లారెడ్డి తుకారాం తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. కార్యక్రమానికి కల్హేర్ పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ ఏ. రవీ గౌడ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం
**-- నారాయణఖేడ్‌లో 92 శాతం లక్ష్యం సాధింపు**




**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూన్ 28:** నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. ప్రవీణ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని 7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల మొత్తం 23,739 మంది చిన్నారులు ఉండగా, వారిలో 21,794 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా 92 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో భాగంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని సూచించారు. మిగిలిన పిల్లలకు కూడా ఇంటింటి సర్వే ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరణి తదితర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అసైన్డ్ భూమి ఆక్రమించి వెంచర్కు రోడ్డు నిర్మాణం.

- పంచాయతీ అనుమతులు లేకుండానే భారీ ఎత్తున ఆర్చ్ నిర్మాణం.
- వెంచర్ చుట్టూ పెద్దపెద్ద ప్రహరీ గోడలు.
- పెద్దవాగును మూసి వెంచర్ కి వెళ్లేందుకు రహదారి ఏర్పాటు.
- వెంచర్ రోడ్డు ఏర్పాటు కొరకు ప్రభుత్వ భూముల నుండి ఎర్రమట్టి దోపిడి.
- నోటీసులకే పరిమితమవుతున్న అధికారులు.
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఆగని పనులు అధికారుల నిర్లక్ష్యం.
- ఇరిగేషన్,పంచాయతీ అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

**ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్** కొండాపూర్ మండల పరిధిలో శరవేగంగా విస్తరిస్తున్న లేఅవుట్లు, వెంచర్లలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు, నీటిపారుదల కాలువలు, కుంటలు, నక్షా బాటలు ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత శాఖలు సమర్థవంతంగా స్పందించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు, వార్తా కథనాలు వచ్చినప్పుడల్లా అధికారులు నోటీసులు జారీ చేయడం తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కోనాపూర్లో అసైన్డ్ భూమిపై రహదారి కోనాపూర్ గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 180 అసైన్డ్ భూమి నుంచి సుమారు 40 అడుగుల వెడల్పుతో 120 మీటర్ల మేర రహదారి నిర్మించి వెంచరు అనుసంధానం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులకు గ్రామపంచాయతీ, రెవెన్యూ తహసీల్దార్ అనుమతులు ఉన్నాయని వెంచర్ నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, అసైన్డ్ భూమిపై ఈ విధమైన రహదారి నిర్మాణానికి ఏ నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కుంట పూడ్చివేతపై అనుమానాలు సీసీ రోడ్డు ప్రారంభ భాగంలో ఉన్న నీటిపారుదల కుంటను సగానికి పైగా పూడ్చివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటిపారుదల శాఖ అనుమతి ఉందని నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా లేదా అనే అంశంపై స్పష్టత లేదు. నక్షా బాటల ఆక్రమణ.. రైతులకు ఇబ్బందులు మహ్మదాపూర్ శివారులోని వెంచర్ మధ్యలో ఉన్న నక్షా బాటను ఆక్రమించి, చివర భాగంలో ప్రత్యామ్నాయ దారి ఇస్తామని రైతులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న నీటిపారుదల కుంటను సగానికి పైగా పూడ్చివేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నీటిపారుదల శాఖ అనుమతి ఉందని నిర్వాహకులు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా లేదా అనే అంశంపై స్పష్టత లేదు.

నక్షా బాటల ఆక్రమణ.

రైతులకు ఇబ్బందులు మహ్మదాపూర్ శివారులోని వెంచర్ మధ్యలో ఉన్న నక్షా బాటను ఆక్రమించి, చివర భాగంలో ప్రత్యామ్నాయ దారి ఇస్తామని రైతులకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న వ్యవసాయ దారులను మార్చే అధికారం ఎవరికుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.సర్వే 40 దారి రిసార్టులు, వెంచర్లకు అసైన్డ్ భూముల నుంచే రోడ్లు మునిదేవునిపల్లి సర్వే నంబర్ 92 ప్రాంతంలో







ప్రైవేట్ రిసార్టుకు అసైన్డ్ భూముల మీదుగా రహదారి ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాలువలు, కుంటలు మూసివేసి నిర్మాణాలు జరిగినా సంబంధిత శాఖలు స్పందించలేదని స్థానికులు చెబుతున్నారు.

**పలు గ్రామాల్లో శరవేగంగా వెంచర్లు**

తెర్పోల్, మాచేపల్లి, హరిదాస్ పూర్, మన్ సన్ పల్లి మల్లేపల్లి, మల్కాపూర్, తొగర్పల్లి, కొండాపూర్, అనంతసాగర్, కోనాపూర్ తదితర గ్రామ శివారుల్లో పెద్ద ఎత్తున వెంచర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కొండలు, గుట్టలు, వాగులు, కాలువలు, కుంటల పరిసరాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

## మునిదేవుని పల్లి 7 లక్షల పంచాయతీ

# నిధుల దుర్వినియోగం చర్యలేవి

**విచారణకే పరిమితమైన జిల్లా పంచాయతీ అధికారులు.**

**3 నెలలు గడిచినా చర్యలు శూన్యం..**

**పంచాయతీ అధికారుల తీరుపై గ్రామస్తుల ఆగ్రహం**




**కొండాపూర్ ప్రజా జ్యోతి** మునిదేవునిపల్లి గ్రామపంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గ్రామపంచాయతీ ఖాతా నుంచి సుమారు 7 లక్షల నిధులను ప్రైవేట్ వ్యక్తుల ఖాతాలకు బదిలీ చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గ్రామస్తులు ఏప్రిల్ 10న జిల్లా కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలకు ఫిర్యాదు ర్యాదు చేశారు. "పీర్లబా "పీర్లబాయి రిపేర్" పేరుతో పంచాయతీ తీర్మానం చేసి, సంబంధిత శాఖల అంచనాలు (ఎస్టిమేషన్) లేకుండానే పనులు చేయకముందే నిధులు డ్రా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వార్తాపత్రికల్లో కథనాలు వెలువడటంతో ఏప్రిల్ 22న డీఎల్పీవో గ్రామపంచాయతీ కార్యాలయానికి వెళ్లి పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శితో సమావేశం నిర్వహించారు. నిధుల వినియోగంపై వివరణలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అప్పట్లో తెలిపారు. అయితే దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులు జరిగిన ప్రదేశాలను పరిశీలించకుండా కేవలం గ్రామపంచాయతీ కార్యాలయంలోనే విచారణ ముగించారని ఆరోపిస్తున్నారు. పంచాయతీ రికార్డులను కూడా సీజ్ చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులను వివరణ కోరగా, నివేదికను కలెక్టర్కు సమర్పించామని, తుది నిర్ణయం కలెక్టర్ తీసుకుంటారని తెలిపారు. అయితే స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడం వెనుక అధికారుల ఆంతర్యం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా అని ప్రశ్నిస్తున్నారు.తప్పులు జరిగితే విచారణ చేసి చర్యలు తీసుకోవాలి గానీ, నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటోంది" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి, తప్పు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**కొండాపూర్ ప్రజా జ్యోతి రిపోర్టర్ శేఖర్**


# 2 ఎకరాల ప్రభుత్వ భూమి 2003,2004 లో రికార్డు తారుమారు.

**2 ఎకరాల ప్రభుత్వ భూమిలో మామిడి తోట వ్యాపారం.**

**సర్వే నెంబర్ 190ఆ, 190ఆ/1 మన్సన్ పల్లి సంఘటన.**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండల పరిధిలోని మన్సాన్పల్లి గ్రామ ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 190ఆ, 190ఆ/1లో రెండు ఎకరాల భూమి మన్సాన్పల్లి గ్రామానికి చెందిన మందుల ఆంజనేయులు పేరు పై రెండు ఎకరాల ప్రభుత్వ భూమి సాగు చేసుకోవడానికి అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. ఈ యొక్క భూమిని 2003 2004 సంవత్సరంలో అప్పటి రెవెన్యూ అధికారులు రికార్డులు తారుమారు చేసి హైదరాబాద్ కు చెందిన విద్యాసాగర్ పేరుపై ఒక ఎకరా,వరప్రసాద్ పేరుపై మరో ఒక ఎకరా భూమి 2004లో రైతు పేరును తొలగించి హైదరాబాద్ కు చెందిన వారిపై భూమి మార్పిడి చేశారు. అప్పటినుండి మామిడి తోట ఏర్పాటు చేసి లక్షల్లో ఆదాయం పొందుతూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. రికార్డు తారుమర్రు జరిగినప్పుడు నుండి వార్తా పత్రికలలో కథనాలు ప్రచురించిన సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేరు. కావున ఇకనైనా సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో, రికార్డులు పరిశీలించి న్యాయ పరంగా రైతు మందుల ఆంజనేయులుకు రావాల్సిన రెండు ఎకరాల భూమి ఇప్పించి న్యాయం చేయాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



Land Details

Total Extent (Ac. Gts)
1.0000
Survey No./ Sub-Division No.
190/ఆ1
Land Status
Not Signed - Clear - Aadhaar Incorrect

Nature of Land
Lavuṇi Paṭṭa
Classification of Land
Metta/ Dry

Land Type
Assigned Land

Market value of Survey no.(in INR)
1000000.00

Transaction Status
Survey no / Sub-division is marked as Assigned Lands

Total Extent (Ac. Gts)
1.0000
Survey No./ Sub-Division No.
190/ఆ
Land Status
Not Signed - Clear - Aadhaar available but unable to capture bio metrics

Nature of Land
Lavuṇi Paṭṭa
Classification of Land
Metta/ Dry

Land Type
Assigned Land

Market value of Survey no.(in INR)
1000000.00

Transaction Status
Survey no / Sub-division is marked as Assigned Lands

**తాసిల్దార్ వివరణ.**

ప్రభుత్వ భూమి అమ్మడం కొనడం నేరం ప్రభుత్వ భూమి కబ్జా చేసి వ్యాపారం చేయడం నేరం రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూమి వ్యాపారం చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకుంటాం.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలం చెల్లినట్లే..

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**భానూరు గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ**



**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం పటాన్ చెరు మండలం భానూరు గ్రామంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీలో చేరిన గ్రామ పంచాయతీ వార్డ్ సభ్యులు ప్రవళిక నరేందర్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. అతి త్వరలో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ప్రభుత్వం సహకరించక పోయిన నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళ్తున్నామని తెలిపారు. కార్యకర్తలను గుండెల్లో పెట్టుకొని చూసుకుని ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని.. ప్రతి కార్యకర్త పార్టీ పటిష్టతకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, శ్రీనివాస్, సాగర్, శివయ్య, నాగేష్, మధు, రవి, సత్తయ్య, మాణిక్యం, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**జహీరాబాద్ 36 వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్**



**జహీరాబాద్, జూన్ 28(ప్రజా జ్యోతి న్యూస్)** తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జహీరాబాద్ మున్సిపాలిటీ 36 వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ కోరారు. వార్డులోని శాంతినగర్ అంగన్ వాడీ కేంద్రంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సిబ్బందితో కలిసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన తల్లి దండ్రులతో ముచ్చటించారు. గతంలో పోలియో వ్యాధి కారణంగా చాలా మంది చిన్నారులు దివ్యాంగులయ్యారని గుర్తుచేశారు. గత పదేళ్ల పాలనలో పోలియో రహిత భారత్ ఉద్యమాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉధృతం చేసిందన్నారు. నేడు పోలియో కారణంగా ఏ చిన్నారి కూడా దివ్యాంగులయ్యే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చిన్నారు లు ఆరోగ్యంగా ఎదిగేందుకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని వారిని కోరారు.

# కల్వేర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పర్యటన.





పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవం..

పోలియో టీకాలు 5 సంవత్సరాల లోపు చిన్నారుల కు

కాంక్రీట్ సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభోత్సవం పాల్గొన్న ఎమ్మెల్యే

**కల్వేర్, 28.జూన్. ప్రజా జ్యోతి.** కల్వేర్ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పర్యటించి పల్స్ పోలియో కార్యక్రమంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా స్థానిక పల్స్ పోలియో కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు తమ బాధ్యతగా పిల్లలకు పోలియో మందు అందించాలని ఆయన కోరారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న పోలీస్ స్టేషన్ స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భవనం లో కీ మార్చడం. నూతన హంగులతో అన్ని రకాల సదుపాయాలు తో పోలీస్ స్టేషన్లను ఎమ్మెల్యే ప్రారంభించారు . కల్వేర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన రహదారి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోడి గంగారాం,. ఉపసర్పంచ్.పి. మహేష్, సీనియర్ నాయకుడు భూరుగుల పోచయ్య,.. మలదొడ్డి తుకారాం..గైని దేవదాస్, పి. వెంకటరెడ్డి, ఎం. శ్రీనివాస్ గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాలమూరుకు బ్రహ్మోస్ యూనిట్

**మహబూబ్ నగర్ :** పాలమూరు జిల్లాకు ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ రానుందనే ఆశలు మళ్లీ చిగురిస్తున్నాయి. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో భేటీలో ఈ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వం మిస్సైల్ యూనిట్ ఏర్పాటుకు సానుకూలంగా ఉండడంతో మరోసారి ఆసక్తికరంగా మారింది. ప్రతిపాదిత ప్రాంతంపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గతేడాది జూన్ 18న సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు.తెలంగాణ ప్రాంతంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ను విస్తరించాలని సంస్థ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ ? బెంగళూరు మధ్యలో మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలంలో అవసరమైన ప్రభుత్వ స్థలం ఉందని వివరించారు. సీఎం వినతికి స్పందించిన ప్రతినిధులు ఆ తర్వాత మూడురోజుల్లోనే స్థల పరిశీలన చేసి నివేదిక రూపొందించారు.వాస్తవంగా మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వాయ్ పల్లి, చౌదర్ పల్లి గ్రామాల మధ్య సుమారు 400 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుంది. ఔఊ 44, ఔఊ 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలతో ఇబ్బందులు లేవు. అలాగే శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సుమారు 100కిలో మీటర్ల దూరంలోనే ఉంది. గతేడాది స్థల పరిశీలన చేసిన అధికారులు పలు సూచనలు చేసినట్లు సమాచారం. మిగతా ప్రాంతాల్లోనూ స్థల అన్వేషణ చేసినా ఆఖీఆఒ బృందం పాలమూరు జిల్లా వైపే మొగ్గు చూపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఇక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు మరోసారి చర్చకు రావడంతో చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామస్థుల్లో ఆశలు పెరిగాయి. దేశ రక్షణలో కీలకంగా మారిన మిస్సైల్ తయారీ తమ ప్రాంతంలో తయారు కావడాన్ని గర్వంగా ఫీల్ అవుతామంటున్నారు. అన్ని సౌకర్యాలు అనుకూలంగా ఉన్న నేపథ్యంలో కచ్చితంగా ఈ బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు, ప్రాంత అభివృద్ధికి అవకాశం లభిస్తుందని చెబుతున్నారు.త్వరలోనే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ ఏర్పాటు విషయంలో కేంద్రం అనుమతి వస్తుందని అందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు.

## తెలంగాణకు బంపర్ ఆఫర్

## కేంద్ర కేబినెట్‌లోకి ఇద్దరు..ఓ రెడ్డి..ఓ బీసీ..!

**హైదరాబాద్ :** తెలంగాణపై బీజేపీ సీరియస్‌గానే ఉన్నది అధికారం దక్కించుకోవడమే కేంద్రంగా ఏమి చేయాలో అన్నీ చేయడానికి సిద్ధపడింది. సేమ్ చంద్రబాబు తరహాలో అవును..చంద్రబాబు కూడా ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలిసినవారు పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు..ఏటికి ఎదురీదుతున్నప్పుడు, ఎవరితోనైనా చేతులు కలుపుతాడు అంతిమ లక్ష్యం అధికారం చేజిక్కించుకోవడం.ఇప్పుడు మోడీ, అమిత్ షాల ద్వయం తెలంగాణను తమ ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నది. వ్యూహాలకు మరింతగా పదును పెడుతున్నది. మరో రెండు, మూడు రోజుల్లో కేంద్రం చేపట్టబోయే కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో తెలంగాణకు రెండు మంత్రి పదవులు దక్కనున్నాయి.ఒక్కటి ఇస్తే అదే పదివేలు అనుకుంటున్నారంతా అలాంటిది రెండు ఇవ్వాలనే కచ్చితమైన నిర్ణయానికి వచ్చినట్టుగా ఢిల్లీ పెద్దలు చర్చించుకుంటున్నారు. ఇందులోనూ సామాజిక సమీకరణలకు పెద్దపీట వేయనున్నారు. డీకే అరుణ, ఈటల రాజేందర్‌లకు దాదాపుగా కేబినెట్‌లో బెర్త్ ఖరారైందని తెలుస్తోంది. మొదటి నుంచి వీరిద్దరి పేర్లు ప్రధానంగా చర్చలో ఉన్నాయి. కానీ ఇద్దరికీ ఇవ్వడం కష్టమేననే భావన అందరిలో ఉంది.ఇప్పటికే బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు మంత్రి పదవులున్నాయి. మరో ఇద్దరికి ఇవ్వకున్నా,ఈటల రాజేందర్‌కు వస్తుందనే ప్రచారం ఉండే. ఆయన బీఆరెస్ పార్టీని వీడిన తరువాత అమిత్ షా అభయం మేరకే బీజేపీలో చేరారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఆయనకు అపార అనుభవం ఉంది. బీసీ ముదిరాజ్ కులానికి చెందిన ఈటల రాజేందర్‌కు మాస్ లీడర్‌గా మంచి ఫాలోయింగ్ ఉంది. ఆయన సతీమణి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆ వర్గం నుంచి కూడా ఈటల రాజేందర్‌కు బలమైన మద్దతు లభిస్తోంది.ఈ నేపథ్యంలో ఈటల రాజేందర్‌కు మంత్రి పదవి ఇస్తే పార్టీని మరింత బలోపేతం దిశగా తీసుకెళ్తాడని, బీజేపీని తెలంగాణలో అధికారంలోకి తీసుకురావడం పక్కా అనే సమాచారం కేంద్రానికి ఎప్పటికప్పుడు చేరవేస్తూనే ఉన్నారు. మోడీ, అమిత్ షాలు కూడా ఈటలకు ప్రామిస్ చేసి ఉన్న నేపథ్యంలో సమయం కోసం చూస్తున్నారు.

## బోరు బావుల వద్ద వరుస దొంగతనాలు.

రైతుల్లో పెరుగుతున్న భయాందోళన.

వరుసగా వైర్లు చోరీ.. దొంగలు మాత్రం దొరకరు.

రాత్రి గస్తీ పెంచాలని ప్రజల డిమాండ్





**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలోని గుంతపల్లి, గొల్లపల్లి, మన్సాన్‌పల్లి, చెర్లగోపులారం, తెర్పోల్ గ్రామాల శివార్లలోని వ్యవసాయ బోరు బావుల వద్ద కరెంటు వైర్ల దొంగతనాలు వరుసగా జరుగుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వేసవి కాలం నుంచి ఇప్పటివరకు పలుమార్లు జరిగిన ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు దొంగలను గుర్తించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరుకాలం కష్టపడి సాగు చేస్తున్న రైతులకు ఈ దొంగతనాల వల్ల వేల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లడమే కాకుండా, రాత్రి వేళ పొలాలకు వెళ్లాలంటే ప్రాణభయం వెంటాడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస దొంగతనాలు జరుగుతున్నా గస్తీ, పెట్రోలింగ్ తగిన స్థాయిలో లేకపోవడం పోలీసుల నిఘా వైఫల్యమేనని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి వైర్ల దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

## పల్స్ పోలియో చుక్కలు వేసిన గొల్లపల్లి సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** మండలంలోని 5సంవత్సరాల లోపు చిన్నపిల్లలకి పలు రకాల వ్యాధుల నుండి రక్షించడానికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ హాజరై పోలియో చుక్కలు వేశారు. ఆశా వర్కర్లు పలు గ్రామాలలో తెలియజేయడం జరిగింది.ఆదివారం ఉదయాన్నే గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తన కుమారుడికి పోలియో కేంద్రం వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్షిత,అంగన్వాడీ టీచర్ అరుణ,ఆశ వర్కర్ ప్రేమిళా, చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.